'అయితే దాన్ని ఏ తోటమాలి గుడిశలోనో పెట్టించండి-ఇక్కడ- ఈ సభావేదికమీద అది—రామ రాను—పాదు బుద్ధులు—'

'నా అందాల రాణి! కన్యాకుమారి! చూడు శేషయ్యా, ఎంత సుకుమారంగావుందో!'

'చూశానండి. ఇరవై గోళ్లేనా లేవు దానికి-పద్ధెనిమిదే...'

## వేట

'శేషయ్యా?'

'ప్రభూ, నమస్తే!'

'సంతోషకరమైన వార్త-'

'ఏమిటి ప్రభూ?'

'ఈ ఉత్తరంచూడు-ఆ సీలు కళ్లకు అద్దుకో-'

'ప్రభూ! గవర్నరే?'

'ఆ! మరెవరనుకున్నావ్? వేట కొస్తున్నాట్ట-మన వూరు-'

'మహా సంతోషం!'

'గవర్నరు సెక్రెటరీ వ్రాశాడు ఆ ఉత్తరం.'

'చిత్తం చిత్తం! పరమానంద భరితుణ్ణయ్యాను'

'ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నాను. అన్ని సంస్థానాలనీ దర్శించి మనమీద సొడ్డువేశాడేమా అని—'

'చిత్తం! ప్రభువుల కోరిక సిద్ధించే మహత్తర ఘడియలు సమీపిస్తున్నాయండి.'

'రేపు ఆదివారమే వస్తున్నాట్ట ఇక్కడికి-గవర్నరు-పరివారంతో-'

'చిత్తం! ధన్యుల మవుతున్నాం—'

'సోమవారం వేటకు వెడతాడట—'

'చిత్తం! చాలా మంచివాడిలా కన్పిస్తాడండి—'

'చాలా మంచివాడోయ్—లేకపోతే మనమీద అంత అభిమానం-'

'చిత్తం చిత్తం! చాలా మంచివాడండి-'

'మనం అన్నీ సిద్ధంచేయాలి ఆయన వేటకి-'

'తప్పకుండా చేదామండి-ప్రభువులు పూనుకుంటే-'

'వేట బాగా విజయవంతంగా సాగాలి-'

'ఓ! భేషుగ్గా జరిపిస్తామండి-'

'ఇంతే గాకుండా మనం వారికి మర్యాదలు జరపడంలో సాటి సంస్థానాలవారి కెవరికీ తీసిపోకూడదు-'

'చిత్తం చిత్తం! మీరన్నది నిజమేనండి-ఆదివారం కాదండీ ఆయన వచ్చేదీ?'

'అవును, ఆదివారం. చాలా పెద్దమనిషి కూడాను ఆయన. పిల్లలు గలవాడు-ప్రజల కష్టసుఖాలు బాగా అర్థం చేసుకోగలవాడు-'

'అవునండి అవునండి-'

'మనం బాగా మర్యాదచేయాలి-'

'తప్పకుండా చెయ్యాలండి-'

'నువ్వు వెంటనే-'

'నేను వెంటనే-'

'ఏమేమి చేయాలో అంతా చూసుకో-'

'తప్పకుండా చూసుకుంటానండి. ప్రభువులు తలుచుకుంటే-'

'మరి ఇంకా అలా నించున్నావేం?'

'చిత్తం! నాకో చిన్న సందేహం కలిగిందండి-'

'చిన్నదేనా, పెద్దదా?'

'ఎబ్బే! చిన్నదేనండి?'

'ఏమిటది?'

'ఆయన రావడం, మనం మర్యాదలూ అవీ జరపడం అన్నీ బాగానే జరుగుతాయనుకోండి-'

'అంతే. అంతకంటే ఏముంది? వస్తాడు, మర్యాదలు పొందుతాడు. వేటకు వెళ్ళి తిరిగిపోతాడు-'

'అక్కడే నాకు అర్థం కావడం లేదండి-'

'ఏమిటి అర్థం కావడంలేదు?'

'వేట వేటంటాడు-ఇక్కడ ఏం వేటాడతాడని నా మొహం?'

'......శేషయ్యా!'

'ప్రభూ! గాభరాపడకండి-ఏం వేటాడతాడని?'

'మన సంస్థానంలో పులులూ సింహాలూ లేవు'

'అడివి పందులూ, తోడేళ్లూ లేవు-'

'దుప్పులూ లేళ్ళూ లేవు-'

'ఎలకలూ చుంచులూ లేవు-'

'శేషయ్యా! అంతా అయోమయంగావుంది. అభాసుపడేట్టున్నాము. ఏవీ లేకపోతే ఏం వేటాడతాడు? ఆశాభంగం చెంది-?'

'ప్రభూ! నాక్కొంచం అర్థమవుతూంది-'

'అర్థమవుతూందా? శేషయ్యా! చెప్పు చెప్పు! ఏమేనా వున్నాయా ఇక్కడ వేటాడ్డానికి?'

'ఉన్నాయండి-మీకింకా అర్థమవటంలేదూ?'

'ఏమిటది? త్వరగా చెప్పు శేషయ్యా-?'

'మనల్ని వేటాడతాడండి-వార్ ఫండు కోసం!'

## ప్రభువువారి దివ్యచిత్తం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఏమీ ఊసుపోవడం లేదోయ్ ఈమధ్య-'

'చిత్తం! ఒకో అప్పుడు అలాగే వుంటుందండి.'

'ప్రపంచమంతా ఆద్యంతాలు లేని తుమ్మల బీడులా, తెలుకుల గానుక్కి సంబంధింపబడిన ఎద్దుయొక్క గుడ్డిపరిభ్రమణంలా కనిపిస్తూంది.'